క్లుప్తంగా

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభించి మజ్జిగ పంపిణీ చేస్తున్న జిల్లా పర్యవేక్షక ఇంజినీరు రమణ

కడప కార్పొరేషన్: కడప విద్యుత్ ఉద్యోగుల సామాజిక సేవా సంఘం ఆధ్వర్యంలో విద్యుత్ భవన్‌లో మజ్జిగ, మంచినీరు ఉచితంగా అందించే కేంద్రాన్ని ఆ శాఖ జిల్లా పర్యవేక్షక ఇంజినీరు ఎస్. రమణ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల దాహార్తిని తీర్చేందుకు జిల్లాలో పలుచోట్ల మజ్జిగ, మంచినీటి కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ పి.నరసింహారెడ్డి, సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్‌లు ఎం.మధుసూదన్ రెడ్డి, హుస్సేన్ బాషా పాల్గొన్నారు.

బహుమతుల అందజేత



విద్యార్థినికి బహుమతిని అందజేస్తున్న సత్తార్‌ఫైజీ

కడప ఎడ్యుకేషన్: సికెదిన్నె మండలం మూలవంక జిల్లా పరిషత్ ఉర్దూ ఉన్నత పాఠశాలలో యంబిఎఫ్ నాయకులు జిలాని, విద్యా వేత్త మన్సూర్ అలీఖాన్ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రవక్త భక్తి గీతాల పోటీలు నిర్వహించారు. నాతియ కలాం పోటీల్లో మొదటి స్థానంలో పి. సల్మ ఖనం, రెండవ స్థానంలో అస్మ, మూడవ స్థానంలో ముస్కాన్, మహబుబిలు నిలిచారు. ఈ సందర్భంగా హెడ్ మాస్టర్ మహమ్మద్ ఇర్షాద్ నిర్వాహకులతో కలసి విజేతలకు బహుమతులు అందజేశారు. పోటీల కన్వీనర్ సత్తార్ ఫైజి మాట్లాడుతూ విద్యార్థుల్లోని ప్రతిభ, నైపుణ్యాలను వెలికి తీయాల్సిన బాధ్యత గురువులపై ఉందన్నారు.

రంజాన్ తోఫా పంపిణీ



రంజాన్ తోఫా అందజేస్తున్న ఖాదర్‌బాష తదితరులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : పేద ప్రజలు కూడా పండుగను సంతోషదాయకంగా నిర్వహించుకోవాలన్న ఉద్దేశ్యంతో నిత్యావసర సరుకులతో కూడిన రంజాన్ తోఫా పంపిణీ చేశారు. శుక్రవారం కడప నగరం మేకలదొడ్డి ప్రాంతంలో ది కడప టు వీలర్ మెకానిక్ వెల్ఫేర్ అసోసియేషన్ నగర ఉపాధ్యక్షుడు లయన్ పఠాన్‌ఖాదర్‌బాష ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎండీ రఫీ, జలీల్, ఖదీర్ తదితరులు పాల్గొన్నారు.

విలువలతో కూడిన విద్యనభ్యసించాలి



మాట్లాడుతున్న నిర్మలా బి. ఫార్మసీ కళాశాల చైర్మన్ బి. శ్రీనివాసులు

కడప ఎడ్యుకేషన్: నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు విలువలతో కూడిన విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని నిర్మలా బి. ఫార్మసీ కళాశాల చైర్మెన్ బి. శ్రీనివాసులు పేర్కొన్నారు. కడప నగర శివార్లలోని నిర్మలా బి ఫార్మసీ కళాశాల ఫ్రెషర్స్‌డేను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ మోహన్‌కుమార్ బి ఫార్మసీ కోర్సు ప్రాముఖ్యత, దేశ, విదేశాల్లో దానికున్న విలువ గురించి విద్యార్థులకు తెలియ చేశారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన ఆటపాటల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తకు గాయాలు

కడప అర్బన్ : కడప నగరంలోని జెడ్పీ కూడలి వద్ద శుక్రవారం రాత్రి ద్విచక్ర వాహనాన్ని వెనుకవైపు నుంచి టిప్పర్ ఢీ కొంది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనంలో వెళుతున్న భార్యా భర్త తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు.

దరఖాస్తు చేసుకోండి

కమలాపురం : పట్టణంలోని బీసీ, కాపు, ఈబీసీ, కమ్మ, రెడ్డి, ఆర్యవైశ్య, క్షత్రియ, బ్రాహ్మణ కార్పొరేషన్లకు సంబంధించి బీసీ కార్పొరేషన్ కడప ద్వారా కుట్టు మిషన్ శిక్షణ ఇస్తున్నామని, దీనికి దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ పగడాల జగన్నాథ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆధార్, రేషన్ కార్డుతో పాటు కుల ధృవీకరణ పత్రంతో సహా వచ్చి దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు.

భానుడి భగభగలు..













ఎండలు మండుతున్నాయి. భానుడు సెగలకు ప్రజలు అవస్థలు పడుతున్నారు. రోజు రోజుకూ పగటి ఉష్ణోగ్రతలు పెరిగి పోతుండడంతో జనం బెంబే లెత్తుతున్నారు. అత్యవసర పరిస్థితులలో బయటకు వచ్చే వారు తగు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. చిన్నారులకు టవల్స్ ధరించి ఎండబారిన పడకుండా చూస్తున్నారు. ఇదిలా ఉండగా వివిధ పనుల నిమిత్తం పట్టణంలోకి వచ్చేవారు చెట్ల కింద సేదదీరుతున్నారు. నగరంలో వివిధ ప్రాంతాలలో శుక్రవారం తీసిన చిత్రాలివి.
- ఫొటోలు : సాక్షి ఫొటోగ్రాఫర్, కడప

పర్యావరణ పరిరక్షణకు కృషి



మను కళాశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న విద్యార్థులు, అధ్యాపకులు

కడప ఎడ్యుకేషన్: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు బాధ్యతగా మొక్కలు పెంచాలని మను పాలిటెక్నిక్ కళాశాల ఇన్‌చార్జు ప్రిన్సిపాల్ మిర్జా విలయత్ ఆలీ బైగ్ అన్నారు. కడప నగర శివార్లలోని మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ పాలిటెక్నిక్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జు ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఈ సృష్టిలో మనుషులే కాదు సకల జీవరాసులు వాటి జీవన విధానాన్ని ఆనందంగా గడపాలంటే స్వచ్ఛమైన గాలి, నీరు అవసరం అన్నారు. ప్రతి ఒక్కరు బాధ్యతాయుతంగా మొక్కలు పెంచి పర్యావరణాన్ని కాపాడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్స్ మహమ్మద్ ఖాజామొయిద్దీన్, మోహమ్మద్ సికిందర్ హుస్సేన్, అధ్యాపకులు డాక్టర్ పాండు, ఆయాజ్‌ఉద్దీన్, అబ్దుల్ ఖవీ, ఆకీబ్, ఆల్కం, కిరణ్, విజయ్‌తో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

టీటీడీ పంచాంగం ఆవిష్కరణ



ఉగాది పంచాంగాన్ని ఆవిష్కరిస్తున్న విజయభట్టర్, ఇతర అతిథులు

కడప కల్చరల్ : కడప అర్చక పురోహిత సమాఖ్య ఆధ్వర్యంలో స్థానిక బ్రాహ్మణ వీధిలోని కార్యాలయంలో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని తిరుమల–తిరుపతి దేవస్థానాలు ప్రచురించిన విశ్వావసు నామ సంవత్సర ఉగాది పంచాంగాన్ని ఆవిష్కరించారు. అర్చక పురోహిత సమాఖ్య జిల్లా అధ్యక్షులు విజయ్ బట్టర్ , విశ్వ హిందూ పరిషత్ జిల్లా అధ్యక్షులు చెన్నకృష్ణారెడ్డి, ప్రాంత ధర్మాచర్య సంపర్క ప్రముఖ్ రామ్ మహేష్, తెలుగు జర్నలిస్ట్ ఫోరమ్ జిల్లా అధ్యక్షులు శ్రీకాంత్, సలహాదారులు సుధీర్ పాల్గొన్న ఈ కార్యక్రమంలో విజయ్ బట్టర్ జిల్లా స్థాయిలో సంస్థ ప్రతినిధులైన అర్చక ప్రముఖులందరికీ ఈ పంచాంగాలను ఉగాది కానుకగా అందజేశారు.

అడవుల రక్షణతోనే పర్యావరణ పరిరక్షణ

సిద్దవటం : ప్రతి ఒక్కరూ అడవులను రక్షించి, పర్యావరణాన్ని కాపాడాలని సిద్దవటం రేంజర్ బి. కళావతి తెలిపారు. మండల కేంద్రమైన సిద్దవటంలోని శ్రీ సాయి ఉన్న పాఠశాల విద్యార్థులు ప్రపంచ అటవీ దినోత్సవం సందర్భంగా శుక్రవారం విద్యార్థులు సిద్దవటం రేంజ్‌లోని సాబ్‌బావి బేస్ క్యాంపు అటవీ ప్రాంతంలో అడవుల పట్ల అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. రేంజర్ కళావతి మాట్లాడుతూ అటవీ సంపదను కాపాడాలన్నారు. పచ్చని చెట్లు పెంపకం వల్ల అధిక వర్షాలు పడతాయన్నారు. అడవుల పరిసర ప్రాంతాల్లో ఉన్న ప్రజలు అడవుల్లో చెట్లు నరకడం గాని, నిప్పు పెట్టడం గాని, నేరమని తెలియజేశారు. అడవుల్లో సహజంగా లభించే ఆయుర్వేద మొక్కలు వైద్యానికి చాలా ఉపయోగపడుతాయన్నారు. అలాంటి అడవులను కొల్లకొట్టరాదని ఆమె చెప్పారు. అంతే గాకుండా అటవీ ప్రాంతాల్లో వన్య ప్రాణులు అంతరించి పోకుండా వాటిని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కావున అటవీ ప్రాంతాల్లో ప్లాస్టిక్ వ్యర్థ పదార్థాలను పడవేయవద్దని సూచించారు. అడవుల ప్రాముఖ్యత, వన్య ప్రాణుల కాపాడే విషయమై విద్యార్థులకు అవగాహన కల్పించామని రేంజర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో బెటాలియన్ అడిషనల్ కమాండెంట్ నాగేశ్వరప్ప, డిప్యూటీ రేంజర్ కె.ఓబులేస్, బీటు అధికారులు, ఉపాధ్యాయులు, అటవీ సిబ్బంది, ప్రొటక్షన్ వాచర్‌లు తదితరులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి లేకుండా చూడండి

కమలాపురం : వేసవి కాలం ముగిసే వరకు మండలంలో తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలని ఎంపీడీఓ జ్యోతి తెలిపారు. శుక్రవారం మండలంలోని ఎల్లారెడ్డిపల్లె ఓహెచ్ఎస్ఆర్‌ను ఆమె పరిశీలించారు. రెండు వాల్వులు పనిచేయడం లేదని తెలుసుకున్నారు. తక్షణం వాటిని మార్చాలని కార్యదర్శిని ఆదేశించారు. అలాగే ట్యాంక్ సమీపంలో ఎవరు కూడా చెత్త వేయకుండా చూడాలన్నారు. అలా ఎవరైన చెత్త వేస్తే రూ.2000 జరిమానా విధిస్తామని ఆమె హెచ్చరించారు. అనంతరం ఉపాధి పనులను పరిశీలించారు. ఓఆర్ఎస్ పాకెట్లు, ప్రథమ చికిత్స కిట్లు ఏర్పాటు చేయాలని ఎఫ్ఏ, ఏపీఓలను ఆదేశించారు. కూలీల సంఖ్య పెంచాలని, ప్రతి రోజు రూ.300 కూలీ డబ్బులు పడే విధంగా కొలతలు ఇచ్చి పనులు చేయించాలని ఆదేశించారు.

సరికొత్త ఆవిష్కరణ దిశగా ఆలోచనలు సాగాలి



సమావేశంలో మాట్లాడుతున్న వైవీయూ వీసీ అల్లం శ్రీనివాసరావు

కడప ఎడ్యుకేషన్: సరికొత్త ఆలోచనలతో ఆవిష్కరణల దిశగా విద్యార్థులు ముందుకు సాగాలని యోగి వేమన విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య అల్లం శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం కమ్యూనికేషన్ సిస్టమ్స్ ఇన్ బయాలజీపై సైన్స్ అకాడెమీస్ లెక్చర్ వర్క్‌షాప్ ముగింపు సభను నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన వీసీ ఆచార్య అల్లం శ్రీనివాసరావు మాట్లాడుతూ జాతీయ విద్యా విధానం ద్వారా విప్లవాత్మక మార్పులను ప్రభుత్వం తీసుకువచ్చిందని, ఇకపై విద్యార్థులు కష్టపడడం మీద దేశ భవిష్యత్తు ఆధారపడి ఉందన్నారు. ప్రిన్సిపల్ ఎస్. రఘునాథరెడ్డి సభకు అధ్యక్షత వహించి మాట్లాడుతూ రెండు రోజుల వర్క్‌షాప్‌లో విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంచేలా అకాడమీల సైంటిస్టులు లెక్చర్స్ ఇచ్చారన్నారు. వర్క్‌షాప్ కన్వీనర్ ప్రొ.ఎస్.రాజగోపాల్ ఆర్గనైజేషన్స్ ఆఫ్ థైలకాయిడ్ మెంబరేన్స్ అనే అంశంపై , ఆచార్య ఎస్ నరేష్ బాబు రోల్ ఆఫ్ మైట్రో కాండ్రియా ఇన్ సెల్యులర్ కమ్యునికేషన్స్ అనే అంశంపై మాట్లాడారు. ఆచార్య డాక్టర్ దయానంద్ మూన్‌లైటింగ్ యాక్టివిటీ ఆఫ్ బాక్టీరియల్ ఎంజైమ్స్– ద స్టోరీ ఆఫ్ పాస్ఫోట్రెస్టేసెస్ అనే అంశంపై ఉపన్యసించారు. ఆచార్య ఎ.ఎస్.రాఘవేంద్ర నోబుల్ ప్రైజెస్ ఇన్ బయాలజీ:బేసిక్ రీసెర్చ్ టు అప్లికేషన్స్ అనే అంశంపై మాట్లాడుతూ విద్యార్థులకు శాస్త్రీయ అవగాహన కల్పించారు. ఇండియన్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ (బెంగళూరు), ఇండియన్ నేషనల్ సైన్స్ అకాడమీ (న్యూఢిల్లీ), నేషనల్ అకాడమీ ఆఫ్ సైన్సెస్, ఇండియా (ప్రయాగ్‌రాజ్) పరిశోధక సంస్థలు వై వి యు విద్యార్థులకు భవిష్యత్తులోనూ సహకారం అందించాలని వర్క్ షాప్ సమన్వయకర్త ఆచార్య వి రామకృష్ణ కోరారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ కే రియాజున్నిసా, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ మాదక్క, డా.మాధవరెడ్డి, డాక్టర్ దాక్షాయిని, డాక్టర్ టి చంద్రశేఖర్, ఆచార్య ఏ. చంద్రశేఖర్, డాక్టర్ ముని కుమారి, బయోటెక్నాలజీ అండ్ బయో ఇన్ఫర్మేటిక్స్, ఎన్విరాన్మెంటల్ సైన్స్, ఫుడ్ టెక్నాలజీ , ఎర్త్ సైన్స్ పరిశోధకులు విద్యార్థులు స్కాలర్లు అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉత్తమ పౌరులుగా రాణించాలి



మాట్లాడుతున్న డి. ప్రమీల

కడప ఎడ్యుకేషన్: భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో చేరడం ద్వారా విద్యార్థులు సమాజంలో ఉత్తమ పౌరులుగా రాణిస్తారని జిల్లా స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యదర్శి డి. ప్రమీల పేర్కొన్నారు. శుక్రవా రం కడప నగరం శంకరాపురంలోని స్కౌట్స్ అండ్ గైడ్స్ ప్రాంతీయ శిక్షణ కేంద్రంలో పీఎం శ్రీ పాఠశాలలకు చెందిన స్కౌట్స్ అండ్ గైడ్స్ కు × పెట్రోల్ లీడర్స్ శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి ప్రమీల మాట్లాడుతూ విద్యార్థుల్లో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, జాతీయ సమైక్యత, జట్టు కృషి అలవర్చేలా విద్యార్థి దశనుంచే సమాజం పట్ల బాధ్యతతో వ్యవహరించేలా శిక్షణ ఇచ్చే సంస్థ భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ అని అన్నారు. జిల్లాలోని 42 పీఎం శ్రీ పాఠశాలలకు చెందిన విద్యార్థులకు ఐదు రోజులపాటు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థులు అందరూ క్రమశిక్షణతో శిక్షణను పూర్తి చేసి సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో స్కౌట్స్ అండ్ గైడ్ మాస్టర్లు పాల్గొన్నారు.

మూల్యాంకన కేంద్రంలో వసతులు కల్పించాలి



డీఈఓకు వినతిపత్రాన్ని సమర్పిస్తున్న యూటీఎఫ్ నాయకులు

కడప ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రమైన కడప మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ మెయిన్‌లో ఏప్రిల్ 3వ తేదీ నుంచి జరగనున్న పదవ తరగతి మూల్యాంకన కేంద్రంలో వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకొని వసతులు కల్పించాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ కోరారు. ఈ విషయమై శుక్రవారం యూటీఎఫ్ శాఖ ఆధ్వర్యంలో డీఈఓ షంషుద్దీన్‌ను కలిసి వినతి పత్రాన్ని అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి తీవ్రత ఎక్కువగా ఉన్నందున మూల్యాంకన కేంద్రంలో చలువ పందిర్లు, కూలర్లు, ఫ్యాన్లు తగినన్ని ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే మంచినీటి వసతితో పాటు, మజ్జిగను కూడా అందజేయాలని విజ్ఞప్తి చేశారు. వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉన్నందున ఆరోగ్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలని కోరారు. మూల్యాంకన విధులకు 58 సంవత్సరాల వయస్సు పైబడిన ఉపాధ్యాయులను, దీర్ఘకాలిక జబ్బులతో బాధపడుతున్న వారిని, వికలాంగులను, చంటి బిడ్డల తల్లులకు మినహాయింపు ఇవ్వాలని కోరారు. మూల్యాంకన విధులు నిర్వహించిన వారికి జాప్యం లేకుండా పారితోషికాన్ని చెల్లించేందుకు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ట్రెజరర్ నరసింహారావు, జిల్లా కార్యదర్శి సి.వి.రమణ, జిల్లా కార్యవర్గ సభ్యులు గోపీనాథ్, వీరనారాయణ, సుబ్బారావు, అనిల్ కుమార్, రామకేశవ, జమాల్ బాషా, ప్రకాష్ బాబు, విజయ్ కుమార్ పాల్గొన్నారు.

ఇంటి స్థలాలు మంజూరు చేయాలి



మాట్లాడుతున్న ఈశ్వరయ్య

కడప వైఎస్ఆర్ సర్కిల్ : కబ్జాదారుల నుండి ప్రభుత్వ భూమిని విముక్తి చేసి అర్హులైన పేదలకు పట్టణాల్లో రెండు సెంట్లు గ్రామాల్లో మూడు సెంట్లు ఇంటి స్థలం పంపిణీ చేయాలని, ఇంటి నిర్మాణానికి ఐదు లక్షలు, రెండు ఎకరాల సాగు భూమి పంపిణీ చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి ఈశ్వరయ్య కోరారు. ఈ డిమాండ్ సాధన కోసం ఏప్రిల్ 8 నుండి 10 వరకు రాష్ట్ర వ్యాప్తంగా సీపీఐ చేపట్టిన నిరాహార దీక్షలను జయప్రదం చేయాలని శుక్రవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో సుబ్రమణ్యం అధ్యక్షతన సీపీఐ జిల్లా సమావేశం చేపట్టారు. ఈ సందర్భంగా ఈశ్వరయ్య మాట్లాడుతూ దశాబ్దాల తరబడి పేదలు సొంత ఇంటి కల నెరవేర్చుకోవడం కోసం అధికారులు, అధికార పార్టీ నేతల చుట్టూ తిరుగుతున్నా ఫలితం దక్కడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి ఎస్ వెంకట్ శివ, జిల్లా కార్యవర్గ సభ్యులు పి చంద్రశేఖర్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జి బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

వెంకటస్వామి సేవలు మరువలేనివి



అప్పారి వెంకటస్వామి చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న యూటీఎఫ్ నాయకులు

కడప ఎడ్యుకేషన్: ఉపాధ్యాయ ఉద్యమంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిన గొప్పవ్యక్తి యూటీఎఫ్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి, అప్పారి వెంకటస్వామి అని యూటీయఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మి రాజ, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు అన్నారు. అప్పారి వెంకటస్వామి వర్ధంతి సందర్భంగా శుక్రవారం కడప యూటీఎఫ్ భవన్‌లో ఆయన చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ట్రెజరర్ నరసింహారావు, జిల్లా కార్యదర్శి సివి రమణ, ఆడిట్ కమిటీ కన్వీనర్ ప్రభాకర్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కృష్ణారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు గోపీనాథ్, శివశంకర్, వీరనారాయణ, జమాల్ బాషా, సుబ్బారావు, రామకేశవ, ప్రకాష్ బాబు, విజయ్ కుమార్, శ్రీనివాసాచారి, బాబు తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందు



ముస్లింలకు పవిత్ర మాసం రమజాన్. ఈ నెలలో ఎంతో భక్తి శ్రద్ధలతో నెల అంతా ఉపవాసాలు చేపడతారు. ఈ నెలలోనే పేదలకు ఫిత్ర, జకాత్ లు పంచుతారు. కాగా.. శుక్రవారం రోజున నగరంలో పెద్ద ఎత్తున ఉపవాసాలు చేపట్టిన ముస్లింలకు కొందరు నగరంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. – ఫొటో: సాక్షి ఫొటోగ్రాఫర్ , కడప

ప్రొద్దుటూరు డిపో డ్రైవర్‌పై దాడి తగదు

కడప కోటిరెడ్డిసర్కిల్ : బెంగుళూరు పాయింట్‌లో ఈనెల 20వ తేదిన ఏపీఎస్ ఆర్టీసీ ప్రొద్దుటూరు డిపో డ్రైవర్ ఎస్ఆర్ఎస్ రెడ్డిపై దాడి చేసి రక్తగాయాలు చేయడం తగదని ఏపీ పీటీడీయూ ఎంప్లాయిస్ యూనియన్, నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ నాయకులు తెలిపారు. శుక్రవారం వారు ఈ మేరకు కడపలోని జిల్లా ప్రజా రవాణాధికారి పొలిమేర గోపాల్‌రెడ్డికి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేఎస్ ఆర్టీసీ డ్రైవర్ అజిత్‌సింగ్ చౌహాన్ ప్రొద్దుటూరు డ్రైవర్‌పై దాడి చేశారన్నారు. బాధిత డ్రైవర్ బెంగుళూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడన్నారు. ఈ సంఘటనపై వెంటనే విచారణ జరిపించి బాధ్యుడిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ పీటీడీ ఎంప్లాయిస్ యూనియన్ జోనల్ కార్యదర్శి రాజశేఖర్, జోనల్ అధ్యక్షులు కృష్ణ కుమార్, జిల్లా సెక్రటరీ మూర్తితోపాటు పలువురు నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

డౌన్ సిండ్రోమ్‌పై అవగాహన కలిగి ఉండాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : డౌన్ సిండ్రోమ్ (పెదవుల చీలిక) సమస్యపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని డాక్టర్ ప్రశాంత్‌వర్దన్, హెల్త్ ఎడ్యుకేటర్ ప్రసన్నలత తెలిపారు. శుక్రవారం కడప నగరం నాగరాజు పేట అర్బన్ హెల్త్ ట్రైనింగ్ సెంటర్‌లో ప్రపంచ డౌన్ సిండ్రోమ్(పెదవుల చీలిక) దినోత్సవం సంందర్భంగా ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నవీన్, డాక్టర్ మొహమ్మద్ సమీద్, డాక్టర్ జుమ్మా, సిబ్బంది పాల్గొన్నారు.

జాబ్‌మేళా



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో కంపెనీ ప్రతినిధులు, కళాశాల యాజమాన్యం

కడప ఎడ్యుకేషన్: కడపలోని శ్రీ వివేకానంద మహిళా డిగ్రీ (స్వయంప్రతిపత్తి)లో శుక్రవారం నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో పలువురు విద్యార్థులు సత్తాచాటి ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల కరస్పాండెంట్ డీఎస్ఆర్ మనోహర్‌రెడ్డి, కళాశాల డైరెక్టర్ ఎస్‌పి మధుసూధన్‌రెడ్డి తెలిపారు. చెన్నైకి చెందిన ఏజీఎస్ హెల్త్ కేర్ టెక్నాలజీస్ అనే బహుళజాతి సంస్థ విద్యార్థులకు రాత పరీక్ష, గ్రూప్ డిస్కషన్‌తోపాటు ముఖాముఖిని నిర్వహించారు. ఈ ప్రాంగణ ఎంపికల్లో 42 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని వారు తెలిపారు.